బీఆర్‌ఎస్‌కు ఓటు.. అభివృద్ధికి చోటు

కూకట్‌పల్లి అభ్యర్థి మాధవరం కృష్ణారావు

- చివరి రోజు నియోజకవర్గంలో జోరుగా ప్రచారం
- భారీగా హాజరైన గులాబీ శ్రేణులు, అభిమానులు
- కాంగ్రెస్, బీజేపీ పార్టీల మాటలు నమ్మొద్దని వ్యాఖ్య
- కారు గుర్తుకే ఓటేసి గెలిపించాలని అభ్యర్థన



ఓల్డ్‌బోయిన్‌పల్లి డివిజన్‌లో ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, కార్పొరేటర్


పర్వత్‌నగర్‌లో ఎమ్మెల్యే సతీమణి ప్రచారం



ఓల్డ్‌బోయిన్‌పల్లి: అసెంబ్లీ ఎన్నికల ప్రచారం ఘట్టం మంగళవారం సాయంత్రం ముగిసింది. ప్రచారానికి చివరి రోజు కావడంతో కూకట్‌పల్లి బీఆర్‌ఎస్ అభ్యర్థి మాధవరం కృష్ణారావు ఓల్డ్‌బోయిన్‌పల్లి డివిజన్‌లో ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి బీఆర్‌ఎస్‌కు ఓటు వేసి గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. బీజేపీ, కాంగ్రెస్ అభ్యర్థుల మాటలు నమ్మి మోసపోవద్దని సూచించారు. నియోజకవర్గం గురించి తెలియని వారు సైతం ఇక్కడ అభ్యర్థులుగా నిలబడి పోటీ చేస్తున్నారని అన్నారు. అది చేస్తాం.. ఇది చేస్తామంటూ ఉచిత హామీలు ఇస్తున్నారని దీనిని ప్రజలు గమనించాలన్నారు. బీఆర్‌ఎస్‌కు ఓటేస్తేనే.. అభివృద్ధికి చోటు ఉంటుందని అన్నారు. అందుకే ఈసారి మళ్లీ కారు గుర్తుకు ఓటేసి గెలిపించాలన్నారు. కూకట్‌పల్లి నియోజకవర్గ అభివృద్ధి బీఆర్‌ఎస్ ప్రభుత్వంతోనే సాధ్యమని పేర్కొన్నారు.

◆ **ఎమ్మెల్యేకు మద్దతుగా భారీ బైక్ ర్యాలీ**

ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావుకు మద్దతుగా మంగళవారం కార్పొరేటర్ ముద్దం నర్సింహ యాదవ్ భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. పెద్ద ఎత్తున నాయకులు, కార్యకర్తలు, మహిళలు పాల్గొని ర్యాలీగా ప్రచారం చేశారు. మాటిస్తే తప్పని.. కుటుంబానికి పెద్దన్నగా ఉండే మాధవరం కృష్ణారావును గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. డివిజన్‌లో అభివృద్ధికి బాట వేసి రూ.100కోట్లతో అభివృద్ధి పనులు చేశారన్నారు. ఇది కొనసాగాలంటే మళ్లీ బీఆర్‌ఎస్ ప్రభుత్వమే రావాలన్నారు. ఈ ఎన్నికల్లో కనిపించే కొత్త ముఖాలు 30తేదీ తర్వాత కనిపించరన్నారు. అందుకే అందుబాటులో ఉండే కృష్ణన్నను గెలిపించుకోవాలని కోరారు. ఈ ప్రచారంలో నరేందర్‌గౌడ్, ఇర్ఫాన్, బల్వంత్‌రెడ్డి, మక్కాల నర్సింగ్‌రావు, కనకరాజుయాదవ్, బల్‌రాజు, ఉదయ్‌యాదవ్, పోచయ్య పాల్గొన్నారు.

◆ **కూకట్‌పల్లి:** ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అఖండ విజయమే లక్ష్యంగా మాజీ కార్పొరేటర్ పగుడాల బాబురావుతో కలిసి బాలాజీనగర్ డివిజన్ అధ్యక్షుడు ప్రభాకర్‌గౌడ్ ఆధ్వర్యంలో మంగళవారం బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డివిజన్ పరిధిలోని టి. అంజయ్యనగర్, ప్రగతినగర్, ముష్కిపేట్, చిత్తారమ్మనగర్, హబీబ్‌నగర్, ఆంజనేయనగర్, సేవాలాల్ నగర్, కైత్లాపూర్, జేఎన్‌ఎన్‌యూఆర్ఎం వరకు ర్యాలీగా వెళ్తూ కారు గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు.

◆ మూసాపేట డివిజన్ పరిధిలోని మూసాపేట, జనతానగర్, భరత్‌నగర్, ఈడబ్ల్యూఎస్‌లలో భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. మోతీనగర్‌లో మాజీ కార్పొరేటర్ తూము శ్రావణ్‌కుమార్ బైక్ ర్యాలీ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. గత పదేళ్లలో చేసిన అభివృద్ధిని గుర్తించి కారుగుర్తుకు ఓటు వేసి గెలిపించాలని విజ్ఞప్తి చేశారు.

జోరుగా ఎమ్మెల్యే తనయుడి ప్రచారం

కూకట్‌పల్లి: కేపీహెచ్‌బీ డివిజన్‌లో మంగళవారం కార్పొరేటర్ మందడి శ్రీనివాసరావు, ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు తనయుడు సందీప్‌రావు భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. అభివృద్ధి, సంక్షేమం.. బీఆర్‌ఎస్‌తోనే సాధ్యం అంటూ నినాదాలు చేస్తూ ముందుకు సాగారు. ఎమ్మెల్యే తనయుడు దారిన వెళ్లే వారిని పలకరిస్తూ పదేళ్లలో జరిగిన అభివృద్ధిని వివరించారు. కారు గుర్తుకే ఓటు వేసి గెలిపించాలని అభ్యర్థించారు. రాష్ట్రంలో ముఖ్యమంత్రిగా కేసీఆర్ ఉంటేనే శాంతి భద్రతలు గాడితప్పవన్నారు. ప్రజలు సుభిక్షంగా ఉండాలంటే బీఆర్‌ఎస్ ప్రభుత్వాన్ని తెచ్చుకోవాలని కోరారు.

హ్యాట్రిక్ సాధించాలని 101 కొబ్బరికాయలు కొట్టిన నేతలు

ఓల్డ్ బోయిన్‌పల్లి: కూకట్‌పల్లి బీఆర్‌ఎస్ అభ్యర్థి మాధవరం కృష్ణారావు భారీ మెజారిటీతో హ్యాట్రిక్ విజయాన్ని అందించాలని బీఆర్‌ఎస్ నాయకులు వినాయకుడిని వేడుకున్నారు. మంగళవారం ఓల్డ్ బోయిన్‌పల్లి డివిజన్ నాయకులు మక్కాల సత్యనారాయణ, బల్‌రాజ్, శేఖర్‌గౌడ్, కృష్ణారెడ్డి, నాగేష్ ముదిరాజు, సరోజదేవి, ఉదయరాణి, సాదిక్, పోచయ్య, రాజు, రాధ తదితరులు బోయిన్‌పల్లిలోని వినాయకుడి దేవాయలంలో 101 కొబ్బరి కాయలు కొట్టారు. ఆయన గెలుపు కూకట్‌పల్లి అభివృద్ధికి మలుపు అని అన్నారు. ప్రజలు కారు గుర్తుకు ఓటు వేసి కృష్ణారావును గెలిపించుకోవాలని అభ్యర్థించారు.



ఓటు ఎంతో విలువైనదని అందరూ ఓటు వేయాలన్నారు.

సతీమణి ప్రచారం
అల్లాపూర్ డివిజన్‌లో మహిళా నాయకులతో కలిసి ప్రచారం చేస్తున్న లక్ష్మీబాయి



బాలాజీనగర్, మూసాపేటలో భారీ బైక్ ర్యాలీలో పాల్గొన్న మాజీ కార్పొరేటర్‌లు బాబురావు, తూము శ్రావణ్‌కుమార్


101 కొబ్బరికాయలు కొట్టిన బీఆర్‌ఎస్ నేతలు


కేపీహెచ్‌బీ డివిజన్‌లో ఎమ్మెల్యే తనయుడు సందీప్‌రావు బైక్ ర్యాలీ

ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోండి

కూకట్‌పల్లి బీఆర్‌ఎస్ అభ్యర్థి మాధవరం కృష్ణారావు


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

కూకట్‌పల్లి: ఎన్నికల ప్రచారం చివరి ఘట్టానికి చేరుకున్న సందర్భంగా కూకట్‌పల్లి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మంగళవారం కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ప్రతి ఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకోవాలన్నారు. ఓటు అనేది మన భవిష్యత్ నిర్ణయించేదిగా ఉంటుందన్నారు. అందుకనే ఎవరూ అలసత్వం వహించకుండా ఓటు హక్కు వినియోగించుకోవాలన్నారు.

◆ పదేళ్లుగా కూకట్‌పల్లి నియోజకవర్గం ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దామన్నారు. భవిష్యత్‌లో మరిన్ని మంచి పనులు చేయటానికి తమ అమూల్యమైన ఓటును కారు గుర్తుపై వేసి అఖండ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ముఖ్యమంత్రి కేసీఆర్ అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా ముందుకు వెళ్తున్నారని అన్నారు. గతంలో కూకట్‌పల్లి నియోజకవర్గాన్ని మంచి నీటి సమస్య వెంటాడుతూ ఉండేదన్నారు. నేడు భూగర్భ పైపులైన్ నీటి వ్యవస్థతో పాటు లక్షల గ్యాలన్ల నీటి రిజర్వాయర్లు నిర్మించి మంచినీటి సమస్యను పరిష్కరించామన్నారు.

◆ అనేక మందికి కల్యాణలక్ష్మి, షాదీముబారక్ ద్వారా లబ్ధి చేకూర్చామన్నారు. నేడు పరిశ్రమలకు 24గంటలు విద్యుత్ సరఫరా చేయడంతో కళకళలాడుతున్నాయని అన్నారు. అటు వ్యవసాయం, ఇటు కంపెనీలు అన్నీ కూడా సంతృప్తిగా ఉన్నాయని తెలిపారు. దీనిని కొనసాగించాలంటే మళ్లీ ముఖ్యమంత్రిగా కేసీఆర్‌నే చేసుకుందామని పిలుపునిచ్చారు.

కాంగ్రెస్ పార్టీకే మా మద్దతు: మాల మహానాడు

కూకట్‌పల్లి: మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు, మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు జి. చెన్నయ్య భాగ్యనగర్‌కాలనీలో కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మంగళవారం కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు గొట్టిముక్కల వెంకటేశ్వరరావుతో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా చెన్నయ్య మాట్లాడుతూ... తమ సంపూర్ణ మద్దతు కాంగ్రెస్ పార్టీకి ఇస్తున్నామన్నారు. కూకట్‌పల్లి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి బండి రమేష్‌ని, శేరిలింగంపల్లి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి జగదీశ్వర్‌గౌడ్‌లను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని మాలలు, ఎస్సీ, బీసీ, మైనార్టీలకు విజ్ఞప్తి చేస్తున్నానని అన్నారు. ఈ సందర్భంగా గొట్టిముక్కల వెంకటేశ్వరరావు మాట్లాడుతూ... కాంగ్రెస్ పార్టీకి మద్దతు తెలపడం చాలా సంతోషంగా ఉందన్నారు. కులమతాలకు అతీతంగా ప్రతి ఒక్కరూ కాంగ్రెస్ పార్టీకి ఓటు వేసి గెలిపించాలని కోరారు.

ఘనంగా స్వయం పరిపాలన దినోత్సవం



కూకట్‌పల్లి: కూకట్‌పల్లి జిల్లా పరిషత్ పాఠశాలలో మంగళవారం స్వయం పరిపాలన దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు గురాచారి మాట్లాడుతూ.. విద్యార్థులు సామాజిక బాధ్యత కలిగి ఉండాలన్నారు. సమాజంలో ఉపాధ్యాయ వృత్తి గౌరవప్రదమైన వృత్తి అని పేర్కొన్నారు. విద్యార్థులు బాగా చదివి ఉన్నత స్థాయిని ఎదగాలని ఆకాంక్షించారు. విద్యార్థులు ధైర్యం, ఓర్పు, సహనం కలిగి కష్టించే తత్వం కలిగి ఉండాలని సూచించారు. పిల్లలు తమ విధులను చక్కగా నిర్వహించారని మెచ్చుకున్నారు.

◆ ఈ సందర్భంగా విద్యార్థులు ఉపాధ్యాయులుగా, ప్రధానోపాధ్యాయులు, ఎంఈఓ, డిప్యూటీ డీఈఓ, డీఈఓ, డైరెక్టర్, సెక్రటరీ, విద్యాశాఖ మంత్రిగా వ్యవహరించి అలరించారు. పిల్లలే ఉపాధ్యాయులై తరగతి గదిలో చక్కగా బోధించారు. 15 తరగతులకు సుమారు వంద మంది విద్యార్థులు వివిధ బాధ్యతలు స్వీకరించారు. ఉత్తమంగా బోధించిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు.

◆ ఈ సందర్భంగా ఉపాధ్యాయుడు నరేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. విద్యార్థులు స్వీయ బాధ్యతలు తెలుసుకోవాలన్నారు. పాఠశాల స్థాయిలో వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. వాటిని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

నిధి ఆప్కే నిఖత్‌ను సద్వినియోగం చేసుకోవాలి


నిధి ఆప్కే నిఖత్ కార్యక్రమంలో పాల్గొన్న పీఎఫ్ కార్యాలయ అధికారి

మూసాపేట: మూసాపేటలోని పంచశీల స్కూలులో మంగళవారం నిధి ఆప్కే నిఖత్ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రావిడెంట్ ఫండ్ కార్యాలయ అధికారి మాట్లాడుతూ.. కంపెనీలు, ఖాతాదారుల సమస్యలు పరిష్కరించడానికి ఈ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని అన్నారు. ఖాతాదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రావిడెంట్ ఫండ్ కార్యాలయ అధికారులు, ఖాతాదారులు, తదితరులు పాల్గొన్నారు.

ఫతేనగర్ డివిజన్ సమస్యలను పరిష్కరిస్తా

కూకట్‌పల్లి కాంగ్రెస్ అభ్యర్థి బండి రమేష్



ప్రచారం చేస్తున్న కాంగ్రెస్ అభ్యర్థి బండి రమేష్, సత్యం శ్రీరంగం

కూకట్‌పల్లి: ఎన్నికల ప్రచారాన్ని ఫతేనగర్ డివిజన్‌లో సోమవారం రాత్రి కూకట్‌పల్లి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి బండి రమేష్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఫతేనగర్ డివిజన్ ప్రజలకు ఇప్పటి వరకు ఆర్టీసీ బస్సు సౌకర్యం కూడా లేదన్నారు. పదేళ్లుగా ఈ సమస్యతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నా స్థానిక ఎమ్మెల్యే పరిష్కరించలేదన్నారు. ఫతేనగర్ డివిజన్‌లోని పాఠశాలల పరిస్థితి దయనీయంగా ఉందన్నారు. సరైన వసతులు లేక విద్యార్థులు, ఉపాధ్యాయులు చాలా ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఫతేనగర్ రైల్వే స్టేషన్‌లో దిగిన ప్రయాణికులకు రవాణా సౌకర్యం లేకపోవటంతో బాలానగర్ చివరి బస్‌స్టాప్ వరకు నడుచుకుంటూ వెళ్లాల్సిన పరిస్థితి నెలకొందన్నారు.

◆ లక్షలు వెచ్చించి కట్టిన కమ్యూనిటీహాల్ నిర్వహణ లేక శిథిలావస్థకు చేరుకుంటుందన్నారు. అదే విధంగా భరత్‌నగర్ మార్కెట్ వద్ద ట్రాఫిక్ సమస్య చాలా తీవ్రంగా ఉందన్నారు. ఇక్కడ ఉన్న ఎంఎంటీఎస్, మెట్రో స్టేషన్లకు అనుసంధానంగా ఆర్టీసీ సౌకర్యం లేకపోవటంతో ప్రయాణికులు ఇబ్బందులకు గురి అవుతున్నారన్నారు. ఈ సమస్యలన్నిటిని పరిష్కరించాలంటే రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ హస్తం గుర్తుకు ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ ఎన్నికల ఇన్‌చార్జి డా.సత్యం శ్రీరంగం తదితరులు పాల్గొన్నారు.

భారీ బైక్ ర్యాలీ...

కూకట్‌పల్లి: కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, యువకులు భారీ బైక్ ర్యాలీని ఓల్డ్ బోయినపల్లి నుంచి బాలానగర్ వరకు నిర్వహించారు. ఈ ర్యాలీలో కూకట్‌పల్లి కాంగ్రెస్ అభ్యర్థి బండి రమేష్, ఇన్‌చార్జి డా. సత్యం శ్రీరంగంతో కలిసి బైక్ ర్యాలీలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మహిళా ప్రధాన కార్యదర్శి పుష్పారెడ్డి, దండుగుల యాదగిరి, బాలాజీ పాల్గొన్నారు.

3వేల డబుల్ ఇళ్లు కూడా ఇవ్వలేకపోయారు..

కూకట్‌పల్లి బీఆర్‌ఎస్ అభ్యర్థి మాధవరం కృష్ణారావు నియోజకవర్గంలో 90శాతం అభివృద్ధి చేశానని చెప్పుకోవడం హాస్యాస్పదంగా ఉందని కూకట్‌పల్లి కాంగ్రెస్ అభ్యర్థి బండి రమేష్ అన్నారు. మంగళవారం విలేకరుల సమావేశంలో ఆయన మాధవరం కృష్ణారావుపై పలు ఆరోపణలు చేశారు. నియోజవర్గంలో పాఠశాలల పరిస్థితి ఏ రకంగా ఉందో ప్రజలకు తెలుసన్నారు. నియోజకవర్గంలో కేవలం 3వేల మందికి కూడా ఇళ్లు ఇవ్వలేకపోయారని అన్నారు.

ఎగ్జామినేషన్ అవకతవకలపై విచారణ చేపట్టాలి

కూకట్‌పల్లి: జేఎన్‌టీయూహెచ్ ఎగ్జామినేషన్ విభాగంలో జరిగిన అవకతవకలపై విచారణ చేపట్టాలని జేఎన్‌టీయూ జేఏసీ నేతలు రిజిస్ట్రార్‌కు మంగళవారం వినతిపత్రం అందజేశారు. జేఎన్‌టీయూహెచ్ జేఏసీ నేతలు చైర్మన్ బొట్ల భిక్షపతి, అధ్యక్షుడు మంద రంజిత్‌కుమార్, వైస్‌చైర్మన్ శ్రీనివాస్, కమిటీ సభ్యులు ప్రణయ్, విద్యార్థులు రిజిస్ట్రార్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... ఎగ్జామినేషన్ విభాగంలో జరుగుతున్న అవకతవకలతో యూనివర్సిటీ ప్రతిష్ట కోల్పోతుందన్నారు. వెంటనే ఎగ్జామినేషన్ విభాగంలో అవకతవకలపై పూర్తి స్థాయిలో విచారణ చేపట్టి అక్రమాలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. జరిగిన వాటిపై ఐఏఎస్, ఐపీఎస్ ఉన్నతాధికారులతో విచారణ చేపట్టాలని విజ్ఞప్తి చేస్తున్నామన్నారు. లేకపోతే మేము ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పై అధికారులకు సమస్యను వివరిస్తామని డిమాండ్ చేశారు. తక్షణమే యూనివర్సిటీ వీసీ, రిజిస్ట్రార్, రెక్టార్లు స్పందించి విచారణ కమిటీ వేసి నిజానిజాలను వెలికి తీస్తారన్న ఆశాభావం వ్యక్తం చేస్తున్నామన్నారు. అదే విధంగా భవిష్యత్‌లో ఎలాంటి అక్రమాలకు పాల్పడకుండా కఠిన నిబంధనలు విధించి విద్యార్థుల భవిష్యత్‌కు కృషి చేయాలని కోరారు.



ముమ్మారెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించండి

జనసేన అధినేత పవన్ కళ్యాణ్


బాలానగర్‌లో రోడ్ షోలో మాట్లాడుతున్న జనసేన అధినేత పవన్‌కళ్యాణ్

కూకట్‌పల్లి: కూకట్‌పల్లి బీజేపీ బలపర్చిన జనసేన పార్టీ అభ్యర్థి ముమ్మారెడ్డి ప్రేమకుమార్‌కు మద్దతుగా మంగళవారం మధ్యాహ్నం జనసేన అధినేత పవన్‌కళ్యాణ్ ప్రచారం చేశారు. బాలానగర్ చౌరస్తా నుంచి ప్రారంభమైన ఈ రోడ్ షో హస్మత్‌పేట బస్‌స్టాప్ అంబేడ్కర్ విగ్రహం వద్ద ముగిసింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... కూకట్‌పల్లిలో ముమ్మారెడ్డి ప్రేమకుమార్‌కు అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. నవంబర్ 30న జరిగే ఎన్నికల్లో బ్యాలెట్ సీరియల్ నం.7 గాజు గ్లాసు గుర్తుకు ఓటు వేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ జిల్లా బీజేపీ అధ్యక్షుడు పన్నాల హరీష్‌రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు వడ్డేపల్లి రాజేశ్వరరావు, జనసేన నాయకులు పాల్గొన్నారు.

ముమ్మారెడ్డి సతీమణి విజయలక్ష్మి ప్రచారం


కేపీహెచ్‌బీ డివిజన్‌లో ప్రచారం చేస్తున్న విజయలక్ష్మి

కూకట్‌పల్లి: కూకట్‌పల్లి బీజేపీ బలపర్చిన జనసేన పార్టీ అభ్యర్థి ముమ్మారెడ్డి ప్రేమకుమార్ విజయం కోసం ఆయన సతీమణి ముమ్మారెడ్డి విజయలక్ష్మి మంగళవారం ప్రచారం చేశారు. కేపీహెచ్‌బీ డివిజన్ రోడ్ నం.2, ఈడబ్ల్యూఎస్‌లలో ఇంటింటికీ వెళ్లి ప్రచారం చేశారు. గాజు గ్లాసు గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని అభ్యర్థించారు.

బీఎస్పీకి ఓటు వేసి గెలిపించండి

కూకట్‌పల్లి అభ్యర్థి సంజీవరావు

కూకట్‌పల్లి: ముఖ్యమంత్రి కేసీఆర్ దళితులను ముఖ్యమంత్రిని చేస్తానని... మూడెకరాల భూమి ఇస్తానని ఇవ్వకుండా మోసం చేశారని కూకట్‌పల్లి నియోజకవర్గం బీఎస్పీ అభ్యర్థి సంజీవరావు మంగళవారం పేర్కొన్నారు. ప్రజలు ఇవాళ కోరుకునేది విద్య, వైద్యం అనే నినాదంతో డా. ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ మన కోసం పోరాటం చేస్తున్నారని అన్నారు. 87 శాతం ఉన్న ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలు అందరూ ఏకమై బీఎస్పీ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. రానున్న ఎన్నికల్లో బీఎస్పీ పార్టీకి ఓటు వేసి అఖండ విజయాన్ని చేకూర్చాలని ఓటర్లకు విజ్ఞప్తి చేశారు.

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034, Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.